## క్లుప్తంగా

### మోడల్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**కందుకూరు:** మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీవరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీ చివరి గడువు అని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125 చొప్పున, ఓసీ విద్యార్థులకు రూ.200 రుసుం చెల్లించి telanganams.cgg. gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 27న పరీక్ష నిర్వహించనున్నారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### కందుకూరును అథారిటీలో కలపాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్షం నాయకులు

**కందుకూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫ్యూచర్ సిటీ అథారిటీలోకి కందుకూరు మండలం మొత్తాన్ని కలిపేలా కృషి చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ అథారిటీలోకి కందుకూరు మండలంలోని 35 గ్రామ పంచాయతీలకుగాను 26 గ్రామ పంచాయతీలను తీసుకున్నారని, మిగతా నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, మురళీనగర్, చిప్పలపల్లి, దావూద్‌గూడ, పెద్దమ్మతండాలను విస్మరించారన్నారు. ఆ పంచాయతీలను కూడా కలిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

### సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

**మహేశ్వరం:** ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం పొందడంపై తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు కోటగళ్ల రంజిత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘమైన వర్గీకరణ పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎన్నో ఏళ్ల సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షాన పని చేస్తుందన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి



వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులు

**మీర్‌పేట:** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి టీచర్స్‌కాలనీ కూడలి వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సీఐ నాగరాజుతో కలిసి ఏసీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీటు బెల్టు ధరించని, సరైన నంబర్ ప్లేటు, పత్రాలు లేని వాహనదారులను గుర్తించి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ఏసీపీ అవగాహన కల్పించారు.

# సార్లూ.. జర పట్టించుకోండి

- సమస్యలు పరిష్కరించాలని వర్ధనగర్ కాలనీవాసుల విజ్ఞప్తి

**హయత్‌నగర్:** పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో తమ కాలనీని పూర్తిగా విస్మరిస్తున్నారని హయత్‌నగర్ పరిధిలోని వర్ధనగర్ కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్, ప్రహరీగోడ నిర్మాణం, అంతర్గత రహదారుల వంటి మౌలిక వసతుల కల్పనపై ఎన్నికల సమయంలో భారీ హామీలు ఇచ్చిన నేతలు, ఎన్నికల అనంతరం 'చూద్దాం... చేద్దాం' అంటూ కాలక్షేపం చేస్తూ సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదని వర్ధనగర్ కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఆక్రమణకు కాలనీ స్థలాలు**

హయత్‌నగర్ సర్వే నంబరు 181, 181 పార్ట్‌లో వర్ధనగర్ కాలనీ లే అవుట్‌లో ఓపెన్ స్పేస్‌గా 200 గజాలు, మరోచోట 900 గజాలు కేటాయించారు. కాలక్రమేణా 200 గజాల ఓపెన్ స్పేస్ పూర్తిగా ఆక్రమణకు గురికాగా, 900 గజాల్లో కొంతభాగం ఆక్రమించబడింది. ఈ నేపథ్యంలో స్థలాలను రక్షించుకోవడమే కాకుండా, శుభకార్యాలు, పండుగలు, ఉత్సవాలు నిర్వహించడంతో ప్రజల మధ్య స్నేహాన్ని పెంపొందించేందుకు కమ్యూనిటీ హాల్ ఉపయోగకరమని భావించిన కాలనీవాసులు, కమ్యూనిటీ హాల్, దాని ప్రహరీగోడ, పోచమ్మ తల్లి గుడి నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

**రూ.5 లక్షలు సమకూర్చి**

ఆ నిర్మాణాలు చేసి స్థలాలు రక్షించాలని కాలనీవాసులు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారులను, స్థానిక ప్రతినిధులను పలుమార్లు కోరినా స్పందన కరువైంది. ఎన్నికల సమయంలో లేదా కాలనీ ఉత్సవాలకు వచ్చినప్పుడు, స్థానిక ప్రతినిధులు 'చేస్తాం, చేయిస్తాం' అంటూ హామీలు ఇచ్చినా, వాస్తవ చర్యలు మాత్రం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో 'ఎవరో వస్తారని ఏదో చేస్తారని, ఎదురు చూసి మోసపోకుమా, నిజం మరచి నిదురపోకుమా' అన్న మహాకవి శ్రీశ్రీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని, హయత్‌నగర్‌లోని వర్ధనగర్ కాలనీవాసులు స్థలాల రక్షణ, అభివృద్ధి పనులకు నడుం బిగించారు. కాలనీవాసుల విరాళాలతో రూ.5 లక్షలు సమకూరగా, ఆ నిధులు కమ్యూనిటీ హాల్, ప్రహరీ గోడ నిర్మాణ కట్టుబడికి మాత్రమే సరిపోయాయి.



మధ్యలో ఆగిపోయిన కమ్యూనిటీ హాల్, ప్రహరీగోడ, పోచమ్మ తల్లి గుడి

ప్లాస్టరింగ్ తదితర పనులు ఆగిపోగా, వాటి కోసం ప్రభుత్వం సహాయం చేస్తుందనే ఆశతో కాలనీవాసులు ఎదురు చూస్తున్నారు.

**హామీ నిలబెట్టుకోవాలి**

ఎంతో వ్యయప్రయాసలకోర్చి నిర్మించిన కట్టడాలకు ప్లాస్టింగ్ చేయక పోవడంతో, వర్షాలకు నానిపోయి కూలిపోతాయనే భయంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి ఆగిపోయిన నిర్మాణాలను పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే, కమ్యూనిటీ హాల్‌లో ఉదయం వాకింగ్ చేసేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కూడా కాలనీవాసులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్‌కు బోర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే కాలనీవాసులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, మనస్ఫూర్తిగా విరాళాలు ఇవ్వాలని కాలనీ అసోసియేషన్ మరియు కాలనీ పెద్దలు కోరుతున్నారు.

**అంతర్గత రోడ్లు లేక అవస్థలు**

లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు నిర్మించుకున్నా, కాలనీలో అంతర్గత రహదారుల లేమి ప్రధాన సమస్యగా మారింది. వర్షాకాలంలో మట్టి రోడ్లలో గుంతలు ఏర్పడి, రోడ్లు చిత్తడిగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వానికి



సీసీకి నోచుకోని అంతర్గత రోడ్లు

పన్నులు చెల్లిస్తున్నా సీసీ రోడ్లు నిర్మించడంలో విఫలమవుతోందని కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలనీ అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

**అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ**

కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. రోడ్ల ఇరువైపులా, ఓపెన్ ప్లాట్లలో, కాలనీల మలుపుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. దీనివల్ల దుర్వాసన వ్యాపించడమే కాకుండా, దోమలు, కీటకాలు ప్రబలిపోతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వారానికి ఒకసారి కూడా శుభ్రపరిచే పని జరగడం లేదు. అలాగే చెత్త సేకరణకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**కందుకూరు:** అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గంకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాపై ఆయన సమావేశం నిర్వహించారు. వారి నుంచి సలహాలు, సూచనలు కోరారు. కాగా అవసరమున్న ప్రాంతాల్లో కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని, డూప్లికేట్, చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని రాజకీయ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సరూర్‌నగర్, బాలాపూర్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లో 206 లోకేషన్‌లలో



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

542 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. మొత్తం 5,67,417 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అందులో పురుషులు 2,90,029, స్త్రీలు 2,77,322, నపుంసకులు 66 మంది ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## దేశనాయకుల వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

**మీర్‌పేట:** భగత్‌సింగ్ ఆశయాలు, దేశభక్తిని నేటి యువత, ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) బాలాపూర్ మండల అధ్యక్షుడు కొల్లూర్ భీమేశ్ పిలుపునిచ్చారు. ఈ నెల 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే సభల పోస్టర్లను మంగళవారం బాలాపూర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ మండల కార్యదర్శి కారమోల రాకేశ్, సహాయ కార్యదర్శి కండ్లపల్లి



వర్ధంతి సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

నరేందర్, నాయకులు శంకర్, రాంచందర్, సందీప్‌లు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాలు ఇవ్వాలని వినతి

ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

**ఇబ్రహీంపట్నం:** అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని అనాజ్‌పూర్ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య డిమాండ్ చేశారు. గ్రామంలోని 274 నుంచి 278 వరకు, 281 సర్వే నంబర్లలోని 125 మంది రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. నాటి ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందన్నారు. కానీ తెలంగాణ వచ్చిన అనంతరం కొత్త పాసు పుస్తకాలు ఇవ్వకుండా వాటిని లాక్కొని బడాబాబులకు కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. అనాజ్‌పూర్ రైతులకు న్యాయం చేయాలని ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముత్యాలు, జంగయ్య, లింగస్వామి, భిక్షపతిగౌడ్, రంగయ్య, రవికుమార్, మహేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ జేఏసీ ఏర్పాటు

చైర్మన్‌గా రఘుపతి

**మహేశ్వరం:** మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు వత్తుల రఘుపతిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. కార్యవర్గ సభ్యులు, సలహాదారులుగా కాంగ్రెస్ నుంచి కాకి ఈశ్వర్, అవుల యాదయ్య, బీజేపీ నుంచి పాపయ్యగౌడ్, యాదిష్, జంగయ్యయాదవ్, బీఆర్ఎస్ నుంచి అంగోత్ రాజునాయక్, యాదగిరిగౌడ్, కె.చంద్రయ్య ముదిరాజ్, మనోహర్, సీపీఐ నుంచి దత్తు నాయక్, పి.యాదయ్య, సీపీఎం రవి కుమార్, సమాజ్‌వాది పార్టీ నుంచి కటికెల శ్రీహరి, జర్నలిస్టుల నుంచి యాదగిరిరెడ్డి, కె.జగన్‌రెడ్డి, కె.రాజ్‌కుమార్‌లతో పాటు మండలంలో ఉన్న 30 గ్రామ పంచాయతీల నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులను సలహాదారులుగా ఉంటారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడం కోసం ఉద్యమ కార్యచరణ నిర్వర్తించడానికి ఈ జేఏసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు.



జేఏసీ చైర్మన్‌గా నియమితులైన రఘుపతిని సన్మానిస్తున్న సభ్యులు

## నిస్వార్థంతో ప్రజలకు సేవ చేయాలి

మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్

**తుక్కుగూడ:** రాజకీయ నాయకులు నిస్వార్థంతో ప్రజలకు సేవ చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంశాఖ మంత్రివర్యులు తూళ్ల దేవేందర్‌గౌడ్ సూచించారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ నివాసంలో ఆయన 73వ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు, అభిమానులు మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. అనంతరం దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం ద్వారా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో తూళ్ల వీరేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్, ఆయన



కేక్ కట్‌చేస్తున్న దేవేందర్‌గౌడ్

అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

**మాజీ మంత్రికి శుభాకాంక్షలు**

**పహాడీషరీఫ్:** ఉమ్మడి రాష్ట్ర మాజీ హోం మంత్రి టి.దేవేందర్ గౌడ్ జన్మదినం సందర్భంగా బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.



పహాడీషరీఫ్: దేవేందర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విశ్వనాథ్‌గౌడ్

తుక్కుగూడలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి కేక్ కట్ చేసి తినిపించడంతో పాటు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు చారి, రవి తేజ, సాయి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వేంకటేశ్వరస్వామి మహోత్సవాలు

**కందుకూరు:** మండల పరిధిలోని నేదునూరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు తిరుకల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న విష్వక్సేనార్చన, పుణ్యావాహచనం, రక్షాబంధనం, మ త్సంగ్రహణం, అంకురార్పణతో తిరు కల్యాణో త్స వాలు ప్రారంభమవుతాయన్నారు. 20న ఉద యం స్వామివార్లకు అభిషేకం, ధ్వజారోహణము, రాత్రి కి గరుడ సేవ, 21న మధ్యాహ్నం అలివేలుమంగా, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి తిరుకల్యాణోత్సవం జరుగనుందన్నారు. రాత్రికి రథోత్సవం కొనసాగుతుందన్నారు. 22న కుంకుమార్చన, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 23న పూర్ణాహుతి, సప్తావరణాలతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. భక్తులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

### ఆలయ వార్షికోత్సవం

**కొందుర్గు:** మండలంలోని గంగన్నగూడ గ్రామంలో గల అభయాంజనేయస్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, చందనాలంకరణ కార్యక్రమం జరిపించారు. అదేవిధంగా హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

### మాలలపై పక్షపాత వైఖరి వీడాలి

**చేవెళ్ల:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల పట్ల పక్షపాత వైఖరిని వీడాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీల కులగణన 2025 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణతో ఎస్సీలలోని ఒక బలమైన విభజన రేఖ ఏర్పడుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయటంతో ఎస్సీ కులాల్లోని ఆయా కులాల పట్ల తీవ్ర ద్వేషం, అనైక్యత పెంపొందుతుందన్నారు. వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మాలలను మనువాదులుగా, ద్రోహులుగా చిత్రీకరించి సమాజం ముందు దోషులుగా నిలబెట్టాలనే కుట్రలను మాల సమాజం తిప్పి కొట్టాలన్నారు. మాలల హక్కులపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలివ్వండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమాదిగ

**ఆమనగల్లు:** ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ కోరారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం ఉద్యోగాల ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ సంఘీభావం ప్రకటించారు. దీక్షలో శ్రీను, సుధాకర్, సంజీవ, గోపాల్, వెంకటేశ్, పాండు, నవీన్, రజనీకాంత్, ఆంజనేయులు, సంతు, శ్యాంసుందర్, మధు, రవి, యాదగిరి, జగన్, సుల్తాన్, ఎల్లయ్యలు కూర్చున్నారు. కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీ జరిగితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చేవరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు.



తలకొండపల్లిలో రిలే దీక్షలో కూర్చున్న నాయకులు

## దృష్టి లోపం నిర్ధారణకు శిబిరాలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత

**ఆమనగల్లు:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో దృష్టి లోపాన్ని గుర్తించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుజల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వాళ్లను గుర్తించారు. ప్రభుత్వం నుంచి 350 మంది చిన్నారులకు కళ్లద్దాలు మంజూరయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు డిప్యూటీ డీఎంహెచ్ఓ కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఎక్కువగా టీవీ, మొబైల్ చూడటం వల్ల వారి దృష్టి బలహీనమవుతుందని అన్నారు. అందువల్లే చిన్న వయసులోనే చూపు లోపం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.పూనమ్, రహీం, పద్మజ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి.. మురుగు పారి

- హైదరాబాద్–శ్రీశైలం హైవేపై నిలుస్తున్న వ్యర్థ జలం
- తూతూ మంత్రంగా చేపట్టిన పనులు
- అవస్థలు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

**కందుకూరు:** జాతీయ రహదారి నిర్మించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు మురుగు, వర్షం నీరు పోయే మార్గాన్ని అన్వేషించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో నిత్యం రహదారిపై ము రుగుతో పాటు వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి ప్రయాణికులు, స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. అయినా సంబంధిత అధికారులు తూ తూమంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నా రే తప్పా, సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారు. ఇది మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న పరిస్థితి.

**తొలగించిన కల్వర్టులు**

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని 2016 సంవత్సరంలో విస్తరించారు. ఆ సమయంలో కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టింది అప్పటి కాంట్రాక్ట్ సంస్థ. పాత కల్వర్టులను పూర్తిగా తొలగించి రోడ్డు నిర్మించింది. దీంతో పాటు కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో రెండువైపులా పల్లంగా నిర్మించడంతో పాటు అక్కడ రైస్‌మిల్ వద్ద ఉన్న కల్వర్టును తొలగించింది. దీంతో అప్పటి నుంచి మురుగుతో పాటు వర్షం




కందుకూరు చౌరస్తా రైస్‌మిల్ ఎదుట రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

నీరు నిలిచి సమస్యగా మారింది. ఏడాదిన్నర క్రితం స్థానికుల ఆందోళనలతో రోడ్డు కింద నుంచే కల్వర్టు నిర్మించి చేతులు దులుపుకొన్నారు అధికారులు. అక్కడి నుంచి నీరు బయటికి పోయే మార్గం లేక ప్రస్తుతం ఆ కల్వర్టు పూర్తిగా నిండిపోయి రోడ్డు పైనే మురుగు, వర్షం నీరు నిలుస్తుంది.

**దోమలతో ఇబ్బంది**

అటువైపుగా రాకపోకలు సాగించే వారితో పాటు ఆ సమీపంలోని వ్యాపారస్తులకు మురుగు నీటితో ఇబ్బందికరంగా మారింది. దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు అధికమై అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత అధికార యంత్రాంగం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

> **సమస్య పరిష్కరిస్తాం**
>
> కందుకూరు వద్ద శ్రీశైలం రహదారిపై మురుగు నీటి సమస్య పరిష్కారానికి గతంలో అండర్ కల్వర్టు నిర్మించాం. అయినా మురుగు నీరు పోవడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. త్వరలో సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం.
>
> – గంగాధర్, రెసిడెన్స్ ఇంజనీర్, నేషనల్ హైవే